# నారదుడు

నామరూపాత్మకమైన సృష్టి చరాచర ప్రపంచమంతయూ ఉన్నదే వేదప్రమాణము. వాక్‌రూపము అయిన చాతుర్యము, నాలుగు స్థితులందు క్రిందికి దిగి వచ్చినది. 1. ఉచ్చరించిన వ్యక్తి. 2. సంకల్పము. 3. ఉద్దేశ్యము యొక్క భావము. 4. వెలువడే వాక్కు, శాస్త్రము. ఈ నాల్గింటిని బ్రహ్మకు నాలుగు ముఖములుగా వర్ణించినది. పరా, పశ్యంతి, మధ్యమ, వైఖరిని నిరూపిస్తూ వచ్చినది. మొదటి మూడింటియందున్న తత్త్వములు చక్కగా విచారించిన గోప్యమై మానవునియందుంటున్నాయి. నాల్గవది వైఖరి. వాక్కున వెలువడుతుంది. ఈ నాలుగు శాస్త్రసమ్మతములుగా నిరూపిస్తూ వచ్చినవి. ఈ నాల్గింటిలో ఒక భాగము జననమరణ సంబంధమైనది. మిగిలిన మూడు భాగములు అమృతత్త్వము. అమృతత్త్వములో మూడు భాగములున్నా ఒక భాగమునకు వశుడై అమృతత్వాన్ని మరచిపోతున్నాడు. మానవత్వమునందు అమృతత్త్వము మూడు భాగములుగా ఉన్నది. దీనిని పురస్కరించుకొని 'విశ్వం విష్ణుమయం' అన్నారు. విశ్వం అంతా విష్ణు స్వరూపమని భాగవతము నిరూపించింది. ఇట్టి ఏకత్వమును అనుభవించినవాడు నారదుడు.

**బాల్యం**

ఇతను వేదవాది ఇంటియందున్న దాసి పుత్రుడు. వేదవాది చాతుర్మాస వ్రతము చేయదలంచి మహర్షులందరిని ఆహ్వానించాడు. ఈ చాతుర్మాస వ్రతమనగా వర్షఋతువు, శరద్‌ఋతువు, ఈ నాలుగు మాసములు కాయమును, కాలమును పవిత్రం చేయటానికి పూనుకున్నాడు. ఈ వ్రతము చేసే సమయమున, ఈ దాసి పుత్రుడైన నారదుని, అక్కడి చిన్నచిన్న పనులకు నియమిస్తూ వచ్చారు. అప్పటికి అతనికి ఆరు సంవత్సరముల వయస్సు. తన ఆటపాటలకు స్వస్తి చెప్పి భగవంతుని లీలా గుణ గణ విశేషములను ఏకాగ్రచిత్తుడై విన్నాడు. మధ్యమధ్య ఋషులు చెప్పిన పనులు శిరసావహిస్తూ, సేవరూపమున తన జీవితాన్ని పవిత్రం చేసుకున్నాడు. మిగిలిన యెంగిలి అన్నమును ఆరగిస్తూ వచ్చాడు. తల్లి ప్రేమ అతనిపై అమితముగా ఉండుట చేత అతనిని గూర్చి అనేక రకములుగా విచారిస్తూ వచ్చింది ఆ తల్లి. నాలుగు మాసముల వ్రతము పూర్తికాగానే ఋషులు వారి స్వస్థానమునకు వెళ్ళుటకు సిద్ధముకాగా వారివెంట పోవుటకు సిద్ధమైనది. చిన్న పిల్లవాడు కావటము చేతను, తల్లి ప్రేమ అతనిపై గాఢముగా ఉండుట చేతను, కొంత బోధ గావించి వదలి వెళ్ళినారు. ద్వాదశాక్షరి మంత్రమును ఉపదేశించారు. ఓంనమో భగవతే వాసుదేవాయ, ఓంనమో భగవతే ప్రద్యుమ్నాయ, ఓంనమో భగవతే సంకర్షణాయ అని బోధించారు. ఇంతియేకాక విశ్వమంతయు విశ్వేశ్వరుని స్వరూపమని బోధించారు. ఇట్లు కొంత కాలము గడచినది. ఋషులు చెప్పినది తదేక ధ్యానముతో విచారణ చేయుచూ కాలమును, కాయమును పవిత్రము గావించెడివాడు.

**మాతృవియోగం**

కొంతకాలమునకు ఒక మహనీయుడు వచ్చెను. ఇతడు భక్తిశ్రద్ధలు ఆధారము చేసుకొని, గమనించి, 'తల్లిని విడిచిపెట్టాలనేది కూడా ఒక మోహమే. కావాలని చెప్పుట, వద్దని చెప్పుట కూడా కోరికయే. నేను అనేది నేను కాననేది కూడా అహంకారమే. నేను అని ఉన్నచోట దైవము ఉండదు. దైవమున్నచోట నేను ఉండదు. ఈ రెండు పరస్పరవిరుద్ధ పదములు. వీని ననుసరించక సమత్వమైన దివ్యత్వమును అనుసరించమని ఉపదేశము గావించాడు. ఆనాటినుండి హరిస్తోత్రములు, భజనలు చేయుచు కాలము గడుపుచుండగా ఒకనాటి రాత్రి అతని తల్లి పాలు పితికే నిమిత్తము వెళ్ళుచుండగా నల్లత్రాచు కరచి మరణించినది. ఆ సమయములో కుమారుడు దగ్గరే ఉన్నాడు. ఆమె మరణ బాధను కళ్ళారా చూచినాడు. ఇది మొదటి పరీక్ష. ఈ అవస్థ భగవంతుని లీలలలో ఒకటని

విశ్వసించాడు. తల్లి మరణమునకు యేమాత్రము విచారించలేదు. ఆనందముగా ఉన్నట్లుగా కనిపించాడు. నా తల్లియే జీవించియుండిన నా నిమిత్తమై పరితపించి ఉండేది. ఆమె పరితాపము ఈనాటికి పోయిందని సంతోషించాడు.

**ఘోరతపస్సు**

ఆనాటి రాత్రి ఉత్తర దిశకు ప్రయాణమయ్యాడు. అప్పటికి అతనికి ఏడు సంవత్సరములు. ఘోర అరణ్యములో క్రూరమృగములమధ్య నదులు, బండలు, ముండ్లలో ప్రయాణము సల్పుతున్నాడు. దుర్గమారణ్యములో ప్రవేశించినాడు. హరినామము విడువక స్మరించాడు. ఆహారనిద్రలు చింతించ లేదు. ఏనాటికి భగవంతుని దర్శింతునా అనే సంకల్పము తప్ప ఇతర సంకల్పము లేదు. దేహము కృశించినది. చర్మము బండ బారినది. స్వరము తప్పినది. శ్వాస నిలవటానికి సిద్ధమైంది. ఒక వాణి వినిపించింది. 'బాలకా! నీవెందుకు అలా పరితపించుతున్నావు? నన్ను చూడగోరుచున్నావు. కోరికలు పూర్తిగా నిర్మూలమైనప్పుడే నన్ను చూడగలవు. నన్ను చూడటం కూడా ఒక కోరిక. నేను నేను శ్రీమన్నారాయణునినే దర్శించాలి అని అన్నంత కాలము కుదరదన్నాడు. విశ్వము విష్ణుస్వరూపమే అని ఋషులు చెప్పారు. నీవు మరచిపోతున్నావు. నీ జన్మాంతర సుకృతము యింకా పరిపక్వస్థితికి రాలేదు' అని చెప్పి అంతర్ధానమయ్యాడు. తన దోషమును తాను గుర్తించాడు. వయస్సు చాలా చిన్నదైనా గుణము పెద్దది. భగవంతుడు కులము, ధనము, వయస్సులను చూడడు. పరితాపము గుర్తిస్తాడని మన చరిత్రలందు మహనీయుల దివ్యగాథలు నిరూపించినవి. భగవదనుగ్రహమునకు గుణమే ఆధారము, ప్రమాణము. ఈవిధమైన శబ్దము విన్న తరువాత ఒక వృక్షము క్రింద కూర్చున్నాడు. ఉచ్ఛ్వాస నిశ్వాసములే విష్ణుస్వరూపంగా భావించాడు. నిశ్వాసమే విష్ణుస్వరూపము, ఉచ్ఛ్వాసమే బ్రహ్మస్వరూపము. ఇదియే సోహం అనే మంత్రము. ఉచ్ఛ్వాసము సామవేదముగా, నిశ్వాసము ఋగ్వేదముగా భావించాడు. ఈవిధమైన ఉచ్ఛ్వాసనిశ్వాసములే పఠిస్తూ ఉండగా వాంఛ పాంచభౌతిక దేహమునుండి దూరమైనది. ఉచ్ఛ్వాసనిశ్వాసములు విష్ణుతత్త్వముగా మారి బ్రహ్మతత్త్వములో లీనమైనాడు. మరల క్రొత్త దైవ దేహమును ధరించాడు. నారదుడనగా తంబురను పట్టుకొని దేహధారియై కనిపిస్తుంటాడని మన ప్రమాణము. కాని, ఉచ్ఛ్వాసనిశ్వాసములే నారదుడు. వెన్నెముకలే వీణలుగా తీసుకొని, ఈ సుషుమ్న నాడీ మండలముగా తీసుకొని ప్రాణవాయువు తత్త్వమునే హరినామస్మరణముగా తీసుకొని, 'నీలతోయదమధ్యస్తాద్విద్యుల్లేఖేవభాస్వరా...' అని ఈవిధమైన రూపధారిగా ఏర్పడి గోవిందా, దామోదరా, నారాయణ, హరి అని సంచరిస్తూ వచ్చాడు. బ్రహ్మ యీవిధమైన రూపమును అందిస్తూ వచ్చాడు. కాన, 'బ్రహ్మ మానస పుత్రుడు' అన్నారు. నారమనగా నీరు, నారములు అనగా ప్రజ్ఞాన కిరణములు. ప్రవాహములన్నియూ సముద్రములో లీనమైనట్లుగా ప్రజ్ఞానకిరణములన్నియూ పరబ్రహ్మ స్వరూపములో లీనమైనాయి. అందుకే ప్రజ్ఞానం బ్రహ్మ అన్నారు. మన వెన్నెముకలో నున్న 33 పూసలందు భగవంతుని నామమును మీటుతూ వుండాలని ప్రబోధిస్తూ వచ్చాడు నారదుడు.

ఒకసారి విష్ణుమూర్తి నారదుని మందలించి, 'నీకంటె ఒక రైతు గొప్ప భక్తుడు' అన్నాడు. నారదుడు కలతచెంది ఆ రైతు ఉండే గ్రామానికి వెళ్లి అతన్ని కనుగొని కొన్ని దినాలు అతని జీవిత విధానమును పరిశీలించాడు. ఆ పేద రైతు రోజుకు మూడు సార్లు మాత్రమే భగవన్నామ స్మరణ చేసేవాడు. నిద్ర లేవగానే మొదటిసారి, మధ్యాహ్నం ఒంటిపూట భోజనం చేసేటప్పుడు రెండవసారి, రాత్రి నిద్రపోయేటప్పుడు మూడోసారి. రోజుకు మూడు సార్లు మాత్రమే భగవన్నామ స్మరణచేసే ఈ రైతు తనకంటె గొప్ప భక్తుడుగా పేర్కొనటం నారదునికి అవమానంగా తోచింది. విష్ణుమూర్తి దగ్గరికి తిరిగి వచ్చి విషయం విన్నవించుకున్నాడు. విష్ణువు అభిప్రాయం మార్చుకుంటాడేమోనని ఆశపడ్డాడు. విష్ణుమూర్తి అప్పుడు నారదునికి ఒక పరీక్ష పెట్టాడు. ఒక కుండపైన ఒక కుండ పెట్టుకొని ఐదు కుండల దొంతర శిరస్సుపై మోసుకుంటూ తన మందిరం చుట్టూ ప్రదక్షిణం చేయవలసిందని విష్ణువు నారదుని శాసించాడు. ఐదు కుండలనూ తలమీద పదిలంగా మోసుకుంటూ ఒక చుక్క నీరు క్రింద చిందకుండా మనసంతా కుండల మీదనే నిలుపుతూ నిదానంగా నడచి వచ్చి విష్ణువు సన్నిధికి చేరుకున్నాడు. 'నారదా! నువ్వు ప్రదక్షిణ చేస్తున్న సమయంలో ఎన్ని సార్లు నన్ను స్మరించావో చెప్పు' అని విష్ణువు అడుగగానే నారదుడు చకితుడైనాడు. 'ఆ

సంగతే మరచిపోయినాను, ఒక్కసారికూడా నిన్ను తలచుకోలేదు' అని నారదుడు ఒప్పుకోక తప్పలేదు. అప్పుడు విష్ణుమూర్తి, ' నీకంటే ఆ పేద రైతు గొప్ప భక్తుడని ఒప్పుకోవా? అదృష్టమూ దురదృష్టమూ, మంచీచెడు, ప్రకృతి వైపరీత్యములను గురించిన నిరంతరాలోచనా అనే ఐదు కుండల బరువు మోస్తూకూడా ప్రతి దినమూ మూడు సార్లు నన్ను స్మరించే రైతు నీకంటే గొప్పవాడు కాడా!' అన్నాడు.

భక్తి చేతనే ఆత్మజ్ఞానము పొందవచ్చును. భక్తి హృదయమును పవిత్రమొనర్చును. భావములనుత్తేజ పరచును. సర్వ సమదృష్టినొసగును. భగవంతుని కృపను అందుబాటులోనికి తెచ్చును. సస్యములు తమకు జీవనాధారమైన జలము కొరకు, పైకి తమకడకు రాజాలవని, మేఘములు క్రిందికి దిగి వర్షించునట్లు, తల్లి బిడ్డను ముద్దాడుటకు ఊయల కడకు వచ్చి వంగునట్లు, భక్తులను రక్షించుటకు భగవంతుడు క్రిందికి దిగి వచ్చును. ఆయనను క్రిందికి రప్పింపగల శక్తి భక్తికున్నది. నారదుడొకప్పుడొక శిష్యునకు భగవత్తత్త్వమును బోధించుచూ, 'అన్నిటి కంటెను భక్తి గొప్పది' యనగా, శిష్యుడు' అది ఎట్లు స్వామీ? అన్నింటి కంటెను భూమి గొప్పది కదా?' యని శంకించెను. నారదుడు, 'జలము భూమిని మూడు భాగములు ఆక్రమించియున్నది. తక్కిన భాగమునుకూడా కొంచెము కొంచెముగా కబళించునన్న భయము భూమికున్నది. భూమి ఎట్లు గొప్పది కాగల'దని ప్రశ్నించెను. శిష్యుడు, అట్లైన, జలము గొప్పది అనికదా చెప్పవలసినది' అనెను. వెంటనే నారదుడు, 'అగస్త్యుడొకప్పుడు జలమంతయూ త్రాగి సముద్రములను శోషిల్లజేసియున్నాడు. నీటి గొప్పదనమేమున్నది' అన్నాడు. శిష్యుడు, 'నిజమే! అగస్త్యుడే గొప్పవాడు' అని అన్నాడు. అనగానే, నారదుడు, ' ఆయన ఒక చిన్న నక్షత్రమై ఆకాశముననున్నాడు. కనుక, అగస్త్యుడు గొప్పవాడు కా'దన్నాడు. శిష్యుడు, 'అయితే, ఆకాశమే గొప్ప' దన్నాడు శిష్యుడు. 'ఆకాశము వామనరూప భగవంతుని ఏకపాదము చేతనే ఆక్రమింపబడినది. కావున, అదియును గొప్పదని చెప్ప వీలు లే'దన్నాడు నారదుడు. శిష్యుడు, 'భగవంతుడు గొప్పవాడనుటలో నాకెట్టి సందేహము లే'దన్నాడు. అనగానే, నారదుడు, 'నిజమేగాని, ఆ భగవంతుడు, భక్తుల హృదయములలో నివసించుచుండును. భగవంతుని భరించు భక్తుని హృదయము గొప్పదా? భగవంతుడు గొప్పవాడా? చెప్ప'మన్నాడు. శిష్యుడు, 'భక్తుని హృదయమే గొప్పది. కాకున్న, భగవంతుని నెట్లు భరించగల'దన్నాడు. అప్పుడు నారదుడు, 'భక్తుని హృదయమునకు అంతటి శక్తి యెట్లు వచ్చినదో తెలియునా? భక్తి వలననే వచ్చినది. కాబట్టి, భక్తియే అన్నింటికంటెను గొప్పది' అని చెప్పి శిష్యుని సందేహము తీర్చి తృప్తి పరచెను.

**భక్తి సామ్రాట్**

ఈ జగత్తంతయూ ప్రేమమయస్వరూపము. విశ్వంవిష్ణుస్వరూపం. తానుకాని స్థానము, తనదికాని పేరు జగత్తునందు కానరాదు. కనుక, సర్వమూ భగవత్ స్వరూపమనే భావించి దానిని అనుభవించటమే నిజమైన పరతత్త్వముయొక్క మూలతత్త్వము. ఇట్టి మార్గమునే అవలంబించాడు నారదమహర్షి. 'అయ్యా! నీ మధుర రసమును గ్రోలిన, నీ ప్రేమరసాన్ని అనుభవించే ప్రతి భక్తుడూ తృప్తుడుగా ఉంటున్నాడు. అమృతస్వరూపుడుగా ఉంటున్నాడు. ఆనందమయుడుగా ఉంటాడు. తపస్సులో లీనమై ఉంటాడు. అట్టి దానిని నాకు అనుగ్రహించు. అన్నాడు. భక్తిరాజ్యమునకు ప్రధానమైన చక్రవర్తి నారదుడు. అన్ని లోకములందు ప్రవేశించి ఈ భక్తిని చాటుతూ ఆనందముగా అనుభవింపచేస్తూ, తాను అనుభవిస్తూ వచ్చాడు నారదుడు.